ప్రజలకు మెరుగైన సేవలందించాలి

• మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ • నిజాంపేట మున్సిపాలిటీలో పార్కులు, బస్తీ దవాఖానల పరిశీలన

నిజాంపేట్ మున్సిపాలిటీలో పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మున్సిపల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

దుండిగల్, డిసెంబర్ 20 : మున్సిపాలిటీల్లో ప్రజలకు మౌలికవసతులు కల్పించి, దవాఖానాల్లో నాణ్యమైన వైద్య సేవలందించాలని మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులకు సూచించారు. నిజాంపేట మున్సిపాలిటీలోని పార్కులు, బస్తీ దవాఖానాలను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన పార్కులు, దవాఖానలను సమర్థవంతంగా వినియోగించుకున్నపుడే లక్ష్యం నెరవేరుతుందన్నారు. న్నారు. ప్రగతినగర్‌లోని పార్కు, వాకింగ్‌ట్రాక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అర్బన్ పార్కులు, క్రీడా ప్రాంగణాలను యువత, స్థానికులు ఉపయోగించుకోవాలని సూచించారు. అవసరమైన అదనపు సౌకర్యాలను ఏర్పాటు చేయిస్తామని ఆయన తెలిపారు. బస్తీ దవాఖానాను పరిశీలించి వైద్య సేవల కోసం వచ్చేవారితో సిబ్బంది గౌరవంగా వ్యవహరించాలన్నారు. వార్డు నంబర్ 4లో రోగులను అడిగి వారికందుతున్న సేవలను తెలుసుకున్నారు. దవాఖానలో రికార్డులు, మందుల వివరాలు తనిఖీ చేశారు. అనంతరం మున్సిపల్ ఆఫీసులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సకాలంలో పన్నులు వసూలుతోపాటు నిధులను సరిగా వినియోగించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందాలంటే అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, తాసీల్దార్ పూల్‌సింగ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శభరీష్

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20 : ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం పేట్‌బషీరాబాద్ డీసీపీ శభరీష్ వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా లింగారెడ్డిపేటకు చెందిన సెంట్రింగ్ కార్మికుడు మన్నె మహేశ్(3), కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న షేక్ అమీర్(29) స్నేహితులు. వీరు అల్వాల్, పేట్‌బషీరాబాద్, జిన్నారం, మేడ్చల్, జీడిమెట్ల, శంకరంపేట పరిధిలో పలుచోట్ల 17 బైక్‌లు చోరీ చేశారు. వాటిని వారి గ్రామానికి చెందిన తొగరి రాజు(27) సహాయంతో అమ్మి సొమ్ము చేసుకునే యత్నాల్లో ఉన్నారు. వరుస దొంగతనాల నేపథ్యంలో బుధవారం ఉదయం కొంపల్లి చైరస్తాలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు అమీర్, మహేశ్ చోరీ చేసిన బైక్‌పై వెళ్తూ పట్టుబడ్డారు. వారిని విచారించగా ద్విచక్ర వాహనాల చోరీ బయటపడింది. పోలీసులు నిందితులు ముగ్గురిని రిమాండ్‌కు పంపి సుమారు రూ. 8.5లక్షల విలువైన 17 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, రాజు, క్రైమ్ సిబ్బందిని డీసీపీ అభినందించారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఎంఎల్ ఆర్ విద్యార్థిని

విద్యార్థిని యశస్వినిని అభినందిస్తున్న ఎంఎల్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం

దుండిగల్, డిసెంబర్ 20 : ఢిల్లీలో జరుగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ విద్యార్థిని గుగ్లావత్ యశస్విని ఎంపికైంది. కాలేజీలో నాలుగో సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్న యశస్విని ఇటీవల విజయవాడలో జరిగిన వెస్ట్‌జోన్ ప్రీ రిపబ్లిక్ డే క్యాంపులో పాల్గొని ప్రతిభ చూపి రిపబ్లిక్ డే వేడుకలకు అర్హత సాధించింది. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విద్యార్థి యశస్వినిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు శ్రేయారెడ్డి, ధీరేన్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ రంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ వేడుకల్లో వర్సిటీ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ రిలేషన్స్ వసుమతి, కేపీహెచ్‌బీ కాలనీ సెక్టార్ ఎస్ఐ శ్రీలతారెడ్డి, అధ్యాపకులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 20 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. మంగళవారం వర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ రిలేషన్స్ వసుమతి, కేపీహెచ్‌బీ కాలనీ సెక్టార్ ఎస్ఐ శ్రీలతారెడ్డి, ఏపీ టెక్నికల్ బోర్డు మాజీ కార్యదర్శి సుధీర్‌ప్రేమ్‌కుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ దిలీప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్సిటీలో కులమతాలకతీతంగా ప్రతియేటా క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ అనుబంధ కళాశాలల అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది జక్రయ్య, విద్యార్థి కోఆర్డినేటర్ ఎర్రవల్లి జగన్, భానుప్రకాశ్, శివకుమార్, ప్రవీణ్‌చారి, అఖిల, అంగోత్ సలోమి, ఐజాక్‌పాల్, తనుశ్రీ, బ్లెస్సీ, సుమారు 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు

బండి రమేశ్‌కు శుభాకాంక్షలు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 20 : కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన బండి రమేశ్‌కు బుధవారం ఆ పార్టీ నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. వారిలో కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నాయకులు కొప్పిశెట్టి దినేశ్‌కుమార్, గంటా శ్రీనివాస్, రేష్మా, నళినికాంత్, కర్రమ్మ, స్వరూప,

వాజిద్‌పాషా, నయీం, ఖాజా, రామ్మోహన్‌రావు, నాగేశ్వర్‌రావు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతులు

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

దుండిగల్, డిసెంబర్ 20 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయనకు విన్నవించగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట అభివృద్ధికి సీఎంకు వినతి

సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఐలయ్య

జగద్గిరిగుట్ట, డిసెంబర్ 20 : జగద్గిరిగుట్ట డివిజన్ అభివృద్ధికి సహకారం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. బుధవారం ఐఎన్‌టీయూసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని అసెంబ్లీ ఆవరణలో మర్యాదపూర్వకంగా కలిసి జగద్గిరిగుట్ట పరిస్థితులను వివరించి వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ డిపో, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించినట్టు వారు పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో మాజీ కౌన్సిలర్ వరమ్మ, ఐఎన్‌టీయూసీ కార్యదర్శి ఐలయ్య పాల్గొన్నారు.

పేద యువతి పెండ్లికి సాయం

జవహర్‌నగర్, డిసెంబర్ 20: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని వికలాంగుల కాలనీకి చెందిన దివ్యాంగురాలైన సుగుణ కూతురు కౌసల్య వివాహానికి బుధవారం మేయర్ కావ్య రూ. 5వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. అదేవిధంగా డిప్యూటీ మేయర్ దంపతులు రెడ్డిశెట్టి నాగరాణి శ్రీనివాస్, కౌసల్య పెండ్లికి పుస్తెమట్టెలు అందజేశారు. పేదలను ఆదుకోవడం తమ వంతు బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్, సవితగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో

కూరగాయ	ధర (కిలో)	కూరగాయ	ధర (కిలో)
టమాట	23	ఆలుగడ్డ	21
వంకాయ	45	కీరా	18
బెండకాయ	50	దోసకాయ	28
పచ్చిమిర్చి	45	సోరకాయ	15
బజ్జి మిర్చి	45	పొట్లకాయ(1)	13
కాకరకాయ	55	కందగడ్డ	50
బీరకాయ	55	ఉల్లిపొరక	33
క్యాబేజి	16	ఉల్లిగడ్డ	25
ఫ్రెంచ్ బీన్స్	45	మామిడికాయ	15 నుంచి 20
క్యారెట్	33	అరటికాయ	8 నుంచి 9
కాలీఫ్లవర్	23	చామగడ్డ	45
దొండ	60	ముళ్లంగి (1)	4 నుంచి 6
చిక్కుడు	65	మొరంగడ్డ	21
గోరుచిక్కుడు	55	గుమ్మడికాయ	20
బీట్‌రూట్	28	నిమ్మకాయలు	32 నుంచి 36
క్యాప్సికం	60	మునగకాయ	6 నుంచి 8
పచ్చి బఠాని	37	పుట్టగొడుగులు(200గ్రా)	40
పొప్పడికాయ	40	ఎండుమిర్చి	280
అల్లం	140	వెల్లుల్లి	280

కేపీహెచ్‌బీకాలనీ : ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.